ong-5_ong-5.qxd 6/19/2026 11:42 PM Page 1



## సింగరకొండను టూరిజంగా అభివృద్ధి చేయాలి

- చైర్మన్‌ను కోరిన సింగరకొండ అధికారులు, పాలకమండలి



**అద్దంకి, జూన్ 19, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైన నిధులను కేటాయించాలని, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ఎసి, పాలకమండలి చైర్మన్, సభ్యులు వినతి పత్రం అందజేశారు. భవనాసి చెరువు పరిసరాలతోపాటు ఆలయ పరిసరాలలో రిసార్ట్సు, హోటళ్ళు, టూరిజంకు సంబంధించి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని చైర్మన్ నూకసాని బాలాజీని కోరారు. ఆయనను కలిసిన వారిలో ఎసి మందమంచి తిమ్మానాయుడు, పాలకమండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, డైరెక్టర్లు, గోపి, వెంకటరత్నం, అరబోలు రంగారావు, గొర్రెపాటి పద్మ తదితరులు వున్నారు.

## గ్రానైట్ కార్మికులకు గంజాయి, మత్తు పదార్థాలు నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**సంతనూతలపాడు, (మద్దిపాడు) జూన్ 19. ప్రభాతవార్త**

మద్దిపాడు మండలం గుండ్లా పల్లి గ్రోత్ సెంటర్ లోని మిధనాల్ యూనిట్స్ అయిన జెసి బయోటెక్ లో పనిచేయుచున్న కార్మికులకు గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్వ్యాల నివారణపై చీమకుర్తి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. సుకన్య, సబ్ ఇన్స్పెక్టర్ ఎం. నగేష్, సిబ్బంది, గ్రానైట్ వర్కర్స్ పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఒంగోలులో నూతనంగా నిర్మిస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవన నిర్మాణ పనులను శుక్రవారం కనిగిరి ఎమ్మెల్యే ఒంగోలు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు ఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్నాయా అనే విషయంపై సమీక్ష నిర్వహించారు. కార్యాలయ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. పార్టీ కార్యకలాపాలకు అనుకూలంగా అన్ని సౌకర్యాలతో భవనాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలతో కార్యాలయాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను కూడా పాటించాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఉపయోగపడే విధంగా సమావేశ మందిరాలు, కార్యాలయ గదులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పనులు వేగవంతం చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

## గ్రానైట్ గనులలోముమ్మరంగా భద్రతా తనిఖీలు

- గోల్డెన్ గ్రానైట్స్ లో భద్రత వారోత్సవాలు

**చీమకుర్తి, జూన్ 19, ప్రభాతవార్త**



గ్రానైట్ భద్రతా వారోత్సవాలు చీమకుర్తి గనులలో ముమ్మరంగా జరుగుతుఉన్నాయి. చీమకుర్తి మండలం ఆర్ ఎల్ పురం పరిధిలోని గోల్డెన్ గ్రానైట్స్ వారికి సేఫ్టీ కమిటీ సభ్యులు శుక్రవారం హాజరయ్యారు. క్వారీ మేనేజర్ ఆదూరి గిరిబాబు వారికి స్వాగతం పలికారు. గ్రానైట్ క్వారీ మ్యాప్, క్వారీ జరుగుతున్న విధానం, కార్మికుల భద్రత కోసం తీసుకుంటున్న ఏర్పాట్లను ఈ కమిటీ సభ్యులు పరిశీలించారు. రికార్డులను కూడా తనిఖీ చేశారు. తదనంతరం గోల్డెన్ గ్రానైట్స్ క్వారీ మేనేజర్ మరియు సిబ్బంది సేఫ్టీ కమిటీ సభ్యులను సత్కరించారు. తదనంతరం కామాక్షి గ్రానైట్లో తనిఖీలకు వెళ్లారు. సభ్యులకు స్వాగతం పలుకుతూ క్వారీ సిబ్బంది కట్టిన బ్యానర్లు, ఉప్పుతో తయారుచేసిన అలంకారాలు ఆకట్టుకున్నాయి.

## ఒంగోలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమీక్ష

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగర కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ రావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు, భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పేదల గృహ నిర్మాణాల కోసం నిర్దేశించిన లేఅవుట్లలో అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కలెక్టర్‌ను కోరారు. గృహ నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, స్థలాల అభివృద్ధి, తాగునీరు, విద్యుత్, రహదారి సదుపాయాల ఏర్పాటుపై కూడా సమావేశంలో చర్చించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి ప్రజలకు ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. నగర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పేదల గృహ కలను సాకారం చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ నిర్మాణం పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో పలు అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించి వాటి అమలుకు అవసరమైన చర్యలపై చర్చించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి పనుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు సమాచారం.

## ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రకాశం టాప్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

అడ్వాన్స్ సప్లిమెంటరీ ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో ప్రకాశం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 2,506 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 1,454 మంది బాలురు, 1,052 మంది బాలికలు ఉన్నారు. ఫలితాల్లో 1,427 మంది బాలురు, 1,028 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 2,455 మంది విద్యార్థులు పరీక్షల్లో విజయాన్ని నమోదు చేయడంతో జిల్లా 97.96 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఫలితాలు జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ఉత్తమ ఫలితాలు సాధించడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. పరీక్షలకు ముందు నిర్వహించిన ప్రత్యేక కోచింగ్ తరగతులు, సందేహ నివృత్తి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. విద్యార్థులు ప్రవేశాల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాకు రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం తీసుకొచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందిని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక అభినందించారు.




# ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## నీట్ పునఃపరీక్షకు ఒంగోలులో కట్టుదిట్ట భద్రత ఎస్పీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)2026 పునఃపరీక్షకు ప్రకాశం జిల్లా పోలీసు శాఖ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు వెల్లడించారు. ఒంగోలులోని 6 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,821 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో ప్రతి కేంద్రానికి ఒక సీఐ, ఒక ఎస్ఐను నియమించి మొత్తం 100 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఏదైనా అనుమానాస్పద పరిస్థితి లేదా ఘటన చోటుచేసుకున్నట్లయితే వెంటనే డయల్ 100/112లేదా జిల్లా పోలీసువాట్సాప్‌నంబర్ 9121102266కు సమాచారం అందించాలన్నారు.




## పొగాకు ధరల కోసం

# రైతుల భారీ ట్రాక్టర్ ర్యాలీ

*- వేలాది మంది రైతులు, 600కు పైగా ట్రాక్టర్లతో భారీ ప్రదర్శన*

*- పొగాకు రైతుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక*

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, వేలం కేంద్రాల్లో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఒంగోలులో పొగాకు రైతులు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వెయ్యికి పైగా రైతులు, 600కు పైగా ట్రాక్టర్లతో పాల్గొన్నారు. ఒంగోలు, టంగుటూరు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, మద్దిపాడు మండలాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టొబాకో బోర్డు ఆర్‌ఎం కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ నగర ప్రధాన రహదారుల మీదుగా కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ వరకు సాగింది. రైతు సంఘాల నాయకులు చుండూరి రంగారావు, గుజ్జల ఈశ్వరయ్య, షేక్ బాబు తదితరులు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌టీసీకి రూ.1,000 కోట్లు కేటాయించి పొగాకు కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. వేలం కేంద్రాల్లో ఒక్క బేళ కూడా అమ్ముడుపోకుండా మిగలకుండా చర్యలు తీసుకోవాలని, మార్కెటింగ్ ఇంటర్వెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు నిర్వహించినప్పటికీ రైతులకు ఆశించిన ప్రయోజనం కనిపించలేదని నాయకులు పేర్కొన్నారు. కిలో ధర రూ.200 కంటే తక్కువ కాకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ వ్యాపారులు రూ.150 వరకు మాత్రమే ధరలు చెల్లిస్తున్నారని విమర్శించారు. గతంలో రైతులు సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రభుత్వాలు జోక్యం చేసుకుని మద్దతు అందించాయని, ప్రస్తుతం కూడా అదే తరహాలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పొగాకు సొసైటీలకు తక్షణ నిధులు కేటాయించి రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లు చేపట్టాలని, వేలం కేంద్రాల్లో "నో బిడ్స్" విధానాన్ని కచ్చితంగా అమలు చేసి ప్రతి బేళకు కొనుగోలుదారులను నిర్ధారించాలని కోరారు. ధరల పతనంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, ఎరువులు, పురుగుమందుల ధరలు, కార్మిక వ్యయాలు, రవాణా భారం కారణంగా రైతులపై అదనపు ఒత్తిడి పడుతోందన్నారు. పొగాకు సాగుపై ఆధారపడిన వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు. వేలం కేంద్రాల్లో పారదర్శక విధానాలు అమలు చేసి వ్యాపారుల ఏకపక్ష ధోరణిని అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలగకుండా కనీస మద్దతు ధర తరహా రక్షణ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ర్యాలీ అనంతరం రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ముగ్గురు కూతుర్లను చంపి తండ్రి ఆత్మహత్య

- అగ్రహారం గ్రామంలో ఘోర విషాదం

**చీమకుర్తి, జూన్ 19, ప్రభాతవార్త**



ముగ్గురు కూతుర్ల పాలిట ఓ తండ్రి కాలయముడయ్యాడు. ముగ్గురు కూతుర్లను చంపి, తాను ఉరిపోసుకొని చనిపోయాడు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం కాందూరు వారి అగ్రహారంలో శుక్రవారం ఈ ఘోర విషాదం చోటుచేసుకుంది. మృతులు తండ్రి ఎకుల సుధాకర్ (35), కుమార్తెలు గోచిత (13), పూజిత (11), లోకిత శ్రీ (8)గా గుర్తించారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం ఏకుల సుధాకర్ తన కుమార్తెలు ముగ్గురిపై విష ప్రయోగం చేసి, మరణించారని నిర్ధారించుకున్న తర్వాత సమీప పొలంలోకి వెళ్లి ఒక చెట్టుకు ఉరిపోసుకొని మరణించాడనిపోలీసులు చెబుతున్నారు. చీమకుర్తి లోని ఓ గ్రానైట్ క్వారీలో డ్రైవర్గా పని చేస్తున్న సుధాకర్ తన భార్యతో మూడేళ్లుగా విడిపోయి ఉంటున్నారు. వారి ఇరువురిమధ్య కోర్టులో కేసు కూడా నడుస్తున్నట్టు సమాచారం తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలు మనసులో పెట్టుకొని, తన కుమార్తెలు ముగ్గురిని చంపి తాను కూడా చనిపోయినట్లుగా స్థానికుల అభిప్రాయపడుతున్నారు. ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఈ విషయమై మాట్లాడుతూ కేసు దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత అసలైన వాస్తవాలు వెలుగు చూస్తాయని అంటున్నారు. ఒంగోలు సీఐ దాసరి ప్రసాద్, తాసిల్దార్ ఆర్ బ్రహ్మయ్యలు సంఘటన స్థానిక వెళ్లి పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో కాందూరి వారి అగ్రహారం శోక సంద్రమైంది. ఈ ప్రాంతంలో సంచలనం రేకెత్తించింది.



## సమస్యల పరిష్కారంలో ఆలస్యం వద్దు: ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని ఎమ్మెల్యే బీకే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ సరఫరా, సంక్షేమ పథకాల అమలు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజలు వెల్లడించిన ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించిన ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ సేవలు వారికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్జీల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజావేదిక ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావడం వల్ల పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్జీని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ప్రజలకు సంబంధించిన అత్యవసర సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా అధికారులు పరిశీలించాలని సూచించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## యోగాంధ్రకు విశేష స్పందన..

- యోగా సాధనకు హాజరైన జేసి కల్పనా కుమారి, పలువురు ప్రజా ప్రతినిధులు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరంలోని గాంధీ పార్కులో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్యతో కలిసి ఆమె యోగా సాధనలో పాల్గొని ప్రజలకు ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు భారీ సంఖ్యలో హాజరై వివిధ యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని చెప్పారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా నూతన శక్తి, ఉత్సాహం లభిస్తాయని తెలిపారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ జీవనశైలిలో సానుకూల మార్పులు తీసుకురావడం ద్వారా దీర్ఘాయువు, మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి తేళ్ల రవికుమార్, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ భీమ్‌నాథ్, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ ఆర్.వెంకట్రావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# ఏపీలో ఏక్షణమైనా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్..!

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మరోసారి క్లారిటీ వచ్చింది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. స్థానిక సంస్థలకు సంబంధించి పంచాయతీలతో పాటు మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రత్యేక అధికారులు కొనసాగుతున్నారు. మరో వైపు ఎలక్షన్ కమీషన్ సైతం సన్నాహాలు చేసింది. సెప్టెంబర్ నుంచి స్థానికస ంస్థల ఎన్నికలు ఉంటాయని అంచనాలు ఉన్నాయి. అయితే హైకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వం తరుపు న్యాయవాది స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. బీసీ గణన పూర్తయిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని ఒక పిటిషన్ దాఖలు అయింది కోర్టులో. పాలకవర్గాల గడువు ముగిసిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల నిర్వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలని మరో పిటిషన్ దాఖలు అయింది. ఈ రెండు పిటిషన్లపై విచారణ జరిపిన క్రమంలో ప్రభుత్వం తరుపు న్యాయవాది ఫుల్ క్లారిటీ ఇచ్చారు. కుటుంబాల సర్వేతో పాటు బీసీ రిజర్వేషన్ అధ్యయన కమిటీ నివేదిక వస్తున్న తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో 13వేల పంచాయతీలకు పైగా పాలకవర్గాల పదవీ కాలం గడువు ఏప్రిల్4తో ముగిసింది. దీంతో పంచాయతీలకు




ప్రత్యేక అధికారులను నియమించింది ప్రభుత్వం. వీలైనంత త్వరగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తే రాజ్యాంగబద్ధమైన ఆర్థిక సంఘం నిధులు కేటాయించే పరిస్థితి ఉంది. ఇటీవల 16వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఏపీకి కేంద్ర ప్రభుత్వం 16,000 కోట్ల రూపాయలకు పైగా కేటాయింపులు చేసింది. గత 15వ ఆర్థిక సంఘం కంటే దాదాపు ఓ నాలుగు వేల కోట్ల రూపాయల అదనపు కేటాయింపులు జరిపింది. అయితే పాలకవర్గాలు ఉంటేనే ఈ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుకు అవకాశం ఉంటుంది. అందుకే ఎన్నికల నిర్వహణ వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఇక రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లకు సంబంధించిన పాలకవర్గాల పదవీ కాలం గడువు మార్చి 17తో ముగిసింది. వాటికి సైతం ప్రత్యేక అధికారులు కొనసాగుతున్నారు.

**ఆ ప్రక్రియలు అన్నీ కొలిక్కి:**

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక సంస్థలపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. అయితే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ వచ్చింది. బీసీ గణన చేపట్టిన తర్వాత మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కొంత మంది కోరుతూ వచ్చారు. అటువంటి వారి తరుపున ఒక న్యాయవాది కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. మరో వైపు పంచాయతీలకు తక్షణం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ మరో పిటీషన్ దాఖలు అయింది. ఈ రెండు పిటీషన్లు విచారణకు వచ్చిన క్రమంలో.. కుటుంబాల సమగ్ర సర్వే, బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ఏకసభ్య కమీషన్ అధ్యయనం తుది దశకు చేరుకుంది. అందుకే వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు హైకోర్టుకు ఏపీ ప్రభుత్వ న్యాయవాది స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం జరుగుతోంది. ఈ ప్రక్రియలన్నీ ముగిసిన వెంటనే రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది.

6:6.qxd 6/19/2026 11:39 PM Page 1



# గాలివాన బీభత్సానికి నష్టపోయిన బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అన్నా

**కొనకనమిట్ల, జూన్ 19, ప్రభాతవార్త**



మండలంలోని నాగరాజుకుంట గ్రామంలో గురువారం రాత్రి వీచిన పెనుగాలుల వర్షానికి కామసాని లక్ష్మీరెడ్డి కుటుంబానికి చెందిన కోళ్ళఫామ్(పౌల్ట్రీ)షెడ్డు కుప్పకూలి సుమారు రూ.కోటి నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న గిద్దలూరుమాజీ ఎమ్మెల్యే,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన నష్టాన్ని పరిశీలించారు. కోళ్ళ ఫారమ్ యజమాని, బాధితుడు లక్ష్మీరెడ్డిని పరామర్శించి నష్టం గురించి ఆరా తీశారు. గాలివాన బీభత్సం మూలంగా వాటిల్లిన నష్టానికి పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీరితో పాటు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కామసాని వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపీటీసీలు సీహెచ్ వెలుగొండయ్య, కరేటి నాగ లక్ష్మీ రామ కోటేశ్వరరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

## గొట్లగట్టులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల పంపిణీ సభ ఏర్పాట్లు

### - పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి బాలాజీ నాయక్

**కొనకనమిట్ల, జూన్ 19, ప్రభాతవార్త**



మండలంలోని గొట్లగట్టు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల పంపిణీ సభాస్థలి ఏర్పాట్లను జిల్లా వ్యవసాయాధికారి బాలాజీ నాయక్, మండల వ్యవసాయాధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మధ్యాహ్నం 3గంటల 45 నిమిషాలకు నిధులు విడుదల చేయడం జరుగుతుంది. కావున మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలు పలువురు అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు తెలిపారు. సీఎం నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని డిజిటల్ తెరపై వీక్షించవచ్చునన్నారు. వీరితో పాటు పొదిలి మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

# నగర పంచాయతీ కార్మికులకు గ్లౌజులు అందజేత

### - హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ వితరణ

**పొదిలి, జూన్ 19, ప్రభాతవార్త**



పొదిలి నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు శుక్రవారం హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మొగల్ కరిముల్లా బేగ్ చేతి తొడుగులు అందజేసి వితరణ చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమీషనర్ యు.ఆంజనేయులు మాట్లాడుతూ నగర పంచాయతీ కార్మికులకు చేతి తొడుగులు అవసరం ఉందని, కరిముల్లా బేగ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి వీటిని సమకూర్చుతానని చెప్పారన్నారు. సమాజ సేవలో హబీబుల్లా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకుని కరిముల్లా బేగ్‌ను అభినందించారు. ఫించన్ల సంఘం నాయకులు హుస్సేన్ పాచా మాట్లాడుతూ కరిముల్లా బేగ్ సమాజ సేవలో ఎప్పుడు ముందుంటారన్నారు. యోగా గురువు ఏ.శంకరరావు మాట్లాడుతూ ప్రతి రోజు పేదల ఆకలి తీరుస్తూ, ప్రతి ఏడాది పేదల అవసరాలు తీరుస్తూ సమాజానికి కరిముల్లా ఎంతగానో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం కరిముల్లా బేగ్, కమీషనర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు చేతుల మీదుగా కార్మికులకు గ్లౌజ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ షేక్షావలి, ఏఈ శంకర్ నాయక్, సచివాలయం ఉద్యోగులు, నగర పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలన ప్రజా విశ్వాసానికి నిదర్శనం

### - మోడీ, చంద్రబాబు, పవన్ నాయకత్వంపై ప్రజల నమ్మకం చెక్కుచెదరలేదు

### - బాపట్లలో రెండేళ్ల విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ఏలూరి

**మార్టూరు, జూన్ 19, ప్రభాతవార్త**





ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడి ఎన్డీఏ కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని, దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రెండేళ్ల కాలంలో ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పాలన సాగిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి వర్గానికి చేరవేస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజల నమ్మకం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని, అనేక అడ్డంకులను అధిగమిస్తూ ప్రజలు మెచ్చేలా సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఏ రాజకీయ పార్టీకి లభించని స్థాయిలో మెజార్టీని ప్రజలు కూటమి ప్రభుత్వానికి అందించారని, ఆ నమ్మకానికి తగిన విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. సాగునీటి సంఘాలను బలోపేతం చేస్తూ రైతులకు అండగా నిలుస్తూ రాష్ట్రంలో రామరాజ్య పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి తాగునీటి విడుదల షెడ్యూల్‌ను కూడా ప్రకటించని దుర్మార్గపు పాలన సాగించారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమన్వయంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ రంగ ప్రోత్సాహం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఆయన అన్నారు.

## ఆడిటోరియం అభివృద్ధికి దాతల సహాయం అభినందనీయం

**పీసీపల్లి, జూన్ 19, ప్రభాతవార్త**



పీసీపల్లి జడ్పీ హైస్కూల్ పాఠశాలలో ఆడిటోరియం నిర్మాణానికి దాతల సహాయం అభినందనీయమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పీసీపల్లి జడ్పీ హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులతో 22 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ఆడిటోరియాన్ని గురువారం ఎమ్మెల్యే ఉగ్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇలా దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆడిటోరియం నిర్మాణానికి గల్లా చెన్నయ్య, పోకూరి చిన్న గురవయ్య ,మహేష్, గోగాడ రత్నయ్య, సీఎం కొండయ్యలచొరువ అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, యుటీఎఫ్ సీనియర్ నాయకులు గల్లా చెన్నయ్య మాట్లాడుతూ పీసీపల్లి జడ్పీ హైస్కూల్ ఆడిటోరియం నిర్మాణానికి తమ వంతు కర్తవ్యంగా అభివృద్ధి చేశామని అన్నారు. దాతలు మునగా వెంకటేశ్వర్లు దంపతులు గునుపూడి రాజారావు, డాక్టర్ చెరుకూరి మధు, డాక్టర్ గోవిందరావు, బీసా శివయ్య, డాక్టర్ నూకతోటి బ్రహ్మయ్య, మరో వంద మంది పూర్వ విద్యార్థులు అడిగిన వెంటనే అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించడం మరువలేనిదని మహేష్ అన్నారు. స్థానిక హెచ్ఎం సుబ్బరామయ్య అధ్యక్షతన సభ జరిగింది.ఈ కార్యక్రమంలో హైస్కూల్ కమిటీ చైర్మన్ మల్లేశ్వరి, స్థానిక ఎంఈఓలు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ టి.తారకనాథ్, పొరుగు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ.పోతులూరయ్య, ఎస్ఏ సుభాని, జయశంకర్, హైస్కూల్ ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, మధుబాబు, వై.తిరుపతయ్య,ఈశ్వరమ్మ, రిటైర్డ్ ఎంఈఓ ఎం.నరసింహారావు, జేవీవీ సీనియర్ నాయకులు వి.మాలకొండారెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్లు యూనియన్ నెల్లూరు డివిజన్ కోశాధికారి సీఎం కొండయ్య, పూర్వ విద్యార్థులు ములక నాగేశ్వరరావు, ఏనుగుంట నాగేంద్రబాబు, గుంటగాని భాస్కర్, బలసాని మోహన్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 25న మండల సర్వసభ్య సమావేశం

**నాగులుప్పలపాడు, జూన్ 19, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 25వ తేదీన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం నందు జరుగుతుందని ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నల్లమలపు అంజమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు సంబంధిత శాఖలకు సంబంధించిన సమాచారంతో హాజరవ్వాలని చెప్పారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని తెలియజేశారు.

# బాల్య వివాహాలు చట్టరీత్య నేరం

**నాగులుప్పలపాడు, జూన్ 19, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలంలోని నిడమానూరు గ్రామంలోని హైస్కూల్ నందు బాలికలకు కౌమర దశలో గర్భాధారణ- కారణాలు, దుష్ప్రభావాలు, కౌమార గర్భధారణ నివారిద్దామనే అంశంపై మద్దిపాడు సీడీపీవో పీఆర్ ఇవాంజిలిన్ అధ్యక్షతన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఇవాంజిలిన్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్ధమని, చట్టరీత్యనేరమని తెలియజేశారు. మోషపూరిత సంబంధాలు, పోషకాహార లోపం, బాలికల విద్య కొనసాగింపు గురించి, బాలిక హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నుండి గౌతమి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దదోర్నాలలో ఘనంగా యోగాంధ్ర ర్యాలీ

**పెద్దదోర్నాల, జూన్ 19, ప్రభాతవార్త**



మార్కాపురం జిల్లా మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో శుక్రవారం యోగాంధ్ర ర్యాలీ ఎంపీడీవో టీఎల్ ప్రసూనాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని దోర్నాల పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. నిత్యం యోగ చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి, ఆరోగ్యవంతమైన జీవనం 'జజనసాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులు యోగా ప్రాముఖ్యతను తెలియజేసే నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీఎల్ ప్రసూనాదేవి,మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.పద్మనాభరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.అంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కారక్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొల్ల రామ్మోహన్‌రావు వర్ధంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ

**గుడ్లూరు, జూన్ 19, ప్రభాతవార్త**



గుడ్లూరు బస్టాండ్ వద్ద గొల్ల రామ్మోహన్‌రావు వర్ధంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. నేత్రపురి శ్రీరామ సేవక్, యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిత్యం దాతల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎయిర్‌టెల్ చిన్న(శ్రీనివాసులు) తెలిపారు. వేసవి కాలంలో ఉచిత మంచినీటితో పాటు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం ప్రయాణికులకు స్థానికులకు కొంత ఊరట లభిస్తుంది.

# ఆర్టీసీడిపో సమీపాన నిత్యం ట్రాఫిక్ జామ్

### - అల్లాడుతున్నజనం - పట్టించుకోని అధికారులు

**కందుకూరు జూలై 19 ప్రభాతవార్త,**



కందుకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపాన నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది.పోలీస్,ఆర్టీసీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనితో నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు అల్లాడుతున్నారు.ఈ ప్రాంతంలో లక్షలాది రూపాయలుతో రోడ్డు విస్తరణ కార్యక్రమాలు జరుగుతున్నవి.గతంలో 30అడుగులున్న రోడ్డును ప్రస్తుతం 50కిపైగా అడుగల విస్తీర్ణంలోకి తీసుకొస్తున్నారు. అయితే రోడ్డు విశాలమవడంతో ఆక్రమణదారులుకు మరింత అవకాశం ఏర్పడింది. ప్రధానంగా బస్సులు బయటికివచ్చే ప్రాంతంలో ఇండియన్ టీస్టాల్ వద్ద ఆటోలు నిలుపుతున్నారు.శింగరాయకొండ వెళ్లే ప్రయాణికులును ఆకర్షిస్తున్నారు.అదే ఆర్టీసీ బస్సులు నడిపితే ఈ ఇబ్బంది ఉండదు. రోడ్డు విస్తరించిన ప్రయాణికులుకు ఏమాత్రం సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.అదేవిధంగా డిపో నుంచి కోవూరు రోడ్ టర్నింగు వరకు ప్రయాణికులు నానాయాతనపడుతున్నారు.ఇందులో బాగంగా శుకృవారం సాయంకాలం 6గం॥ల సమయంలో ఆటోలు క్యూలో వచ్చి అరగంటలో 50,60మందిని ఎక్కించుకొని పోయారు. దీంతో బస్సులు ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నప్పటికిని పోలీస్ ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకుంటే సమస్య ఉండదు. ఆదిశగా వారు ఆలోచించకపోవడం,షాపులు యజమానులు చీదరించు కోవడంతో ప్రజలు అసౌకర్యానికి అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికైన సంబందిత అదికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# కందుకూరులో రూ.59 కోట్లతో అభివృద్ధి పనులు

### - శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు జూన్ 19 ప్రభాతవార్త**



కందుకూరు పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం సమీపాన శుకృవారం సుమారు రూ.58.29కోట్లతో చేపట్టబోవు అభివృద్ధిపనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శ్రీకారం చుట్టారు. ఈ మేరకుఆయన శంఖుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మున్సిపల్ పరిధిలోని శివారు గ్రామాలకు రామతీర్థం జలాలు అందించనున్నట్లు వెల్లడించారు.ఇందుకోసం అమృత్ 2.0 పథకం ద్వారా రూ.31.37 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.దీంతో 1 కోటి లీటర్లు సామర్థం కలిగిన మంచినీటి శుద్ధి కేంద్రం ఏర్పాటవుతుందన్నారు. పలితంగాఐఎస్ రావునగర్, లుంబినివనం,ఎర్రగుంటపాలెం, దూబగుంట,ప్రకాశంకాలనీ,సాయినగర్ ప్రాంతాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించనున్నట్లు చెప్పారు. 36 కిలోమీటర్లమేర విలీన గ్రామాలకు పైపులైన్లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.మొత్తం 6,978 ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు ఇస్తారన్నారు.రాబోయే 30 సంవత్సరాలకు సరిపడా తాగునీటి సరఫరా జరుగుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు.

### 6 కుంటల అభివృద్ధి :

అదేవిధంగా పట్టణంలోని 6 కుంటల అభివృద్ధికి రూ.7.5 కోట్లుతో అభివృద్ధిపనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు హరిజనపాలెం ఎర్రకుంటకు రూ.85 లక్షలు,కోమటికుంటకు రూ.1.65కోట్లు,గుణ్ణంకట్టకు రూ.1.6కోట్లు,ఎర్రగుంటపాలెం కుంటకురూ.1.15కోట్లు,దూబగుంట కుంటకు రూ.1.19 కోట్లు, వెంకటాద్రిపాలెం కుంటకు 1.1 కోట్లుతో చుట్టూ వాకింగ్ ట్రాక్, చుట్టూ పచ్చదనం లాంటి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.అదేవిదంగా యూఐడిఎఫ్ పథకం ద్వారా రూ.19.38కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

### లేఅవుట్ పేరుతో కోట్లు దగా!.

లేఅవుట్‌లపేరుతో వైసీపీ నేతలు కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు.వైసీపీ ప్రభుత్వంలో ఎంఐజి లేఅవుట్‌ను ఒక ఆదాయ వనరుగా చూశారని, మట్టితోలకం పేరుతో కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే విమర్శించారు.నిషేధిత 22ఏ జాబితా భూముల గురించి పట్టించుకోలేదన్నారు.అసత్యాలు ప్రచారం,అబద్ధాలు రాయడం కొందరికి అలవాటుగా మారిందన్నారు.కుసంస్కారంతో ప్రవర్తిస్తే ప్రజలు క్షమించరన్నారు.ఇక లేఅవుట్ లో ప్లాట్ల విక్రయాలను నుడా ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఎవరైనా వేలంపాటలో పాల్గొని,ప్లాట్‌లను సొంతం చేసుకోవచ్చన్నారు.తన అభ్యర్థనతో ప్రభుత్వం స్పందించి గజానికి వెయ్యి రూపాయలు చొప్పున ధర తగ్గించిందన్నారు.కొంతమంది కుసంస్కారంతో అబద్ధాలు ప్రచారం చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి చేస్తున్నా బురద చల్లుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ అనూషా,డీఈ గణపతి,ఈఈ సంజయ్, టీడీపీ నేతలు దామా మల్లేష్, మాదాల లక్ష్మినరసింహం, చిలకపాటి మధు, షేక్ సలాం,చదలవాడ కొండయ్య, అల్లం వెంకటేశ్వర్లు, గడ్డం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పైపులైన్‌కు మరమ్మత్తులు

**వార్తకు స్పందన**

**వేటపాలెం .జూన్ 19, ప్రభాతవార్త**



మండలం పందిళ్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ఏర్పాటులో భాగంగా స్తంభాలను నిర్లక్ష్యంగా ఇష్టానుసారంగా వేసి తాగునీటి పైపులను ధ్వంసం చేశారు. దీంతో నీటి వృధాగా పోతుంది. స్థానికు లు ప్రభాతవార్త దృష్టికి తేవడంతో ..శుక్రవారం 'అధికారుల నిర్లక్ష్యం.. పొంచి ఉన్న పెను ప్రమాదం' అనే శీర్షికను ప్రభాతవార్తలో ప్రచురించడంతో స్పందించిన విద్యుత్ లైన్‌మెన్ సురేష్, పంచాయతీ సెక్రటరీ మాల్యాద్రిలు స్తంభాలను సరిచేసి తాగునీటి పైపులను మరమ్మత్తులు చేయించారు. కరెంటు స్తంభాన్ని పక్కన వేయించారు. సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సుబ్బారెడ్డి

**తాళ్లూరు,జూన్ 19, ప్రభాతవార్త**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శిగా మాధవరం గ్రామానికి చెందిన ఐవి సుబ్బారెడ్డి శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర మేధావుల సంఘం కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి లేఖను విడుదల చేశారు.తనను రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమించిన జగనన్నకు, పదవి వచ్చేందుకు కృషి చేసిన దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి,ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఉన్నత పదవి బాధ్యతలు అప్పజెప్పిన వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా రాష్ట్రంలో తనవంతు సేవలు అందిస్తానని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సుబ్బారెడ్డికి పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.కాగా సుబ్బారెడ్డి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గతంలో పని చేశారు.

# భక్తుల సౌకర్యార్థం ఏసీ విరాళం

**సింగరాయకొండ,జూన్ 19,ప్రభాతవార్త**



భక్తుల సౌకర్యార్థం ఏసీని విరాళంగా అందజేయడం అభినందనీయమని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ సన్నిబోయిన శ్రీనివాసులునాయుడు అన్నారు. దక్షిణ సింహాచలం గా పేరుగాంచిన దేవస్థానానికి భక్తులు విరాళాల రూపంలో తమ భక్తిని చాటుకుంటున్నారు.శుక్రవారం దేవస్థానం ప్రాంగణంలో నెల్లూరుకు చెందిన ఆ సోది దినకర్ రెడ్డి, జయ మాధవి దంపతులు రూ.90 వేల విలువైన ఎయిర్ కండీషనర్‌ను (ఏసీ) దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఏసీని చైర్మన్ సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు, కార్యనిర్వాహణాధికారి కృష్ణవేణికి అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. భక్తులు తమ వంతు సహకారాన్ని అందించి దేవస్థాన అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం దాత దంపతులను దేవస్థాన అధికారులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

### - భక్తుల భద్రత,సౌకర్యాలపై అధికారులతో సమీక్ష

**సింగరాయకొండ, జూన్ 19, ప్రభాతవార్త**



మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 24 నుంచి జూలై 4వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం సింగరాయకొండ సీఐ వై. శ్రీహరి, తహసీల్దార్ ఎన్.వి.బి. రాజేష్, విద్యుత్ ఏ.ఈ సాంబశివరావు, దేవస్థానం చైర్మన్ సన్నిబోయిన శ్రీనివాసులు, ఈవో కృష్ణవేణి కలిసి పరిశీలించారు.ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ ఐపీఎస్ సూచనల మేరకు, ఒంగోలు డీఎస్పీ ఆదేశాల ప్రకారం సీఐ శ్రీహరి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, దర్శన సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, బారికేడ్ల ఏర్పాటు, తోపులాటలు నివారించే చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చేర్చించారు.అలాగే రథోత్సవం జరిగే పురవీధులను పరిశీలించి, రథం సాఫీగా ప్రయాణించేలా తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. కొండపైకి వెళ్లే మార్గాలు, గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు, విద్యుత్ భద్రత, తాగునీరు, పారిశుద్ధం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ, రెవెన్యూశాఖ, దేవాదాయశాఖ, పంచాయతీ, వైద్యశాఖ అధికారుల సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చీరాల వాడరేవులో అత్యాధునిక మెరైన్ పోలీసు అవుట్‌పోస్టు ప్రారంభం

**చీరాల, జూన్ 19, ప్రభాతవార్త**





బాపట్ల జిల్లా వాడరేవు సముద్ర తీరంలో అత్యాధునిక మెరైన్ పోలీసు అవుట్‌పోస్టును శనివారం ప్రారంభించడం జరిగింది. కోస్టల్ ఐజీ గోపీనాథ్ జెట్టి, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్,ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, రమానంద సరస్వతిస్వామిలు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బాపట్ల జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి, సిబ్బందికి కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి, యాత్రికుల భద్రత కోసం చేపట్టాల్సిన మెరుగైన చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కోస్టల్ ఐజీ మాట్లాడుతూ కొత్తపట్నం మెరైన పోలీసు స్టేషన్ పరిధి దాదాపు 72 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందన్నారు. పోలీసు స్టేషన్ ఒక చివర నుంచి మరొక చివర వరకు సిబ్బంది విధులు నిర్వహించడం కష్ట సాధ్యంగా ఉండటంతో ఈ అవుట్ పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో మూడవ అత్యంత పొడవైన తీర ప్రాంతాన్ని కలిగి ఉందని, రాష్ట్రానికి 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందన్నారు. రాష్ట్రంలో 595 మత్స్యకార గ్రామాలు, 350 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. వీటి భద్రతను దృష్టిలో ఉంచుకుని12 జిల్లాల పరిధిలో 21 కోస్టల్ మెరైన్ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సముద్ర తీర భద్రత అత్యంత ముఖ్యమైన అంశమని, బాపట్ల జిల్లా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రధానంగా హైదరాబాద్ నుండి వచ్చే యాత్రికులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రాంతంగా ఉండటంతో చీరాల, వాడరేవు, రామాపురం సముద్ర తీరాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో బాపట్ల జిల్లా పర్యాటక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో వేలాది మంది యాత్రికులు ఇక్కడికి వస్తున్నారన్నారు. వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ అవుట్ పోస్టును ఏర్పాటు చేశామన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో జిల్లా పోలీసులతో కలిసి మెరైన పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రాంతాలను భద్రతా పరంగా మరింత అభివృద్ధి చేస్తామని, సీసీ టీవీ, కెమెరాలు, డ్రోన్ల సహాయంతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక రిసార్టులు ఏర్పాటు కావడంతో స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు, రిసార్టుల యాజమాన్యాలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించి యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక మత్స్యకార గ్రామాల ప్రజలకు కూడా ఉపాధి, అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సౌత్ డీఎస్పీ బాలిరెడ్డి, కొత్తపట్నం మెరైన్ సీఐ బి.రమేష్‌బాబు, రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణరెడ్డి, నిజాంపట్నం మెరైన్ సీఐ ఏవీ సురేష్ కుమార్, సూర్యలంక మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, చీరాల రూరల్ సీఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు నూతలపాడులో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

**పర్చూరు, జూన్ 19, ప్రభాతవార్త**



నేడు పర్చూరు నియోజకవర్గంలో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొనున్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో నిర్వహించే రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి బహిరంగ సభలో పాల్గొంటారు. అరుంధతినగర్‌లో రూ.4.80లక్షలతో ఆధునీకరించిన భావిని ప్రారంభిస్తారు. అంకమ్మతల్లి దేవాలయం వద్ద నిర్వహించే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ముసాలాపేటలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. ఆయుర్వేద ఆసుపత్రి, హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తారు, రూ.10లక్షలతో ఆధునీకరించిన ఫిల్టర్ బెడ్‌ను ప్రారంభిస్తారు. రెడ్డిపాలెంలో రూ.8లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. జాగర్లమూడి రోడ్డులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. తెలగపాలెంలో రూ.30లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారు. పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుమ్మరపాలెంలో 11లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం మజీద్‌లో ప్రార్థనల్లో పాల్గొని, ముస్లిం స్మశాన వాటికలో నిర్మించిన నూతన రోడ్డును పరిశీలిస్తారు.రెండేళ్ల నమ్మకం బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం కింద 37,861 మంది లబ్దిదారులకు రూ.26.50కోట్లు అందజేస్తారు. డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణీ, ట్రాక్టర్ల ప్రారంభోత్సవం,ఆటోల పంపిణీ,రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కారక్యకర్త కుటుంబానికి పార్టీ సంక్షేమనిధి నుంచి రూ.5లక్షల చెక్కు అందజేత, నియోజకవర్గంలో 10 మందిదివ్యాంగులకు ప్రభుత్వ సహకారంతో మంజూరైన త్రీవీలర్ స్కూటీలను 10 మందికి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

7:7.qxd 6/19/2026 11:41 PM Page 1



# మార్కాపురం వార్త



# యోగాంధ్రపై అవగాహనా ర్యాలీ



**త్రిపురాంతకం, జూన్19, ప్రభాతావార్త**
త్రిపురాంతకం మండల కేంద్రంలో ఎంపిడిఓ మురళి ఆధ్వర్యంలో శుక్రవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ వాసుదేవరావు, ఎంపిడిఓ మురళి,డిప్యూటీ ఎంపిడిఓ రామలింగేశ్వర రావు, ఎవో సాంబశివరావు, విద్యాశాఖ అధికారులు తులసి మల్లికార్జునాయక్, రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ కిరణ్, ఆర్ఐ శ్రీనివాస్, విఆర్ఓ వెంకటలక్ష్మి, పిడిఓ పగడాల శ్రీనివాసులు, ఖాదర్ వలి, సచివాలయాల సిబ్బంది ఈశ్వర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పూర్తిపై భారీ విజయోత్సవ బైక్ ర్యాలీ





**గిద్దలూరు, జూన్ 19, ప్రభాతవార్త**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన సందర్భంగా గిద్దలూరు పట్టణంలో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం, బిజెపి, జనసేనా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రజక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆత్మీయ సమావేశం

### - కనిగిరి బాల వెంకట రమణ



**మార్కాపురం, జూన్ 19, ప్రభాతవార్త**
రజకుల సమస్యల పరిష్కారం, సామాజిక హక్కుల సాధన, ఎస్సీ జాబితాలో చేర్పు తదితర అంశాలపై చర్చించేందుకు ఈ నెల 28న మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాల్‌లో జిల్లా రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు రజక ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కనిగిరి బాల వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కొల్లు రవీంద్ర, ఎస్. సవిత ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే ఎమ్మెల్యేలు గల్లా మాధవి, కందుల నారాయణరెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి,మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. రజకుల అభ్యున్నతి, హక్కుల సాధనకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రజక సోదరులు, సోదరీమణులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కనిగిరి బాల వెంకట రమణ కోరారు. సమావేశం అనంతరం భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## విజయోత్సవ సభకు భారీగా తరలి వెళ్ళిన టిడిపి శ్రేణులు



**రాచర్ల, జూన్ 19, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన గిద్దలూరులో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ సభకు మండలం నుండి తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా బయలుదేరి వెళ్లారు.ఒంగోలు తెలుగుదేశం పార్లమెంట్ ట్రెజరర్ అంబవరం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉత్సాహంగా సభకు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కంభంలో ఘనంగా యోగాంధ్రా ర్యాలీ



**కంభం, జూన్ 19, ప్రభాతవార్త**
కంభం పట్టణంలో శుక్రవారం యోగాంధ్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల ఎంపీడీవో వీరభద్రాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి చేగిరెడ్డి తలశమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నదని ప్రతి ఒక్కరూ యోగా సాధనను అలవరచుకోవాలని సూచించారు. అనంతరం వారు పట్టణంలోని కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కందులాపురం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కిరణ్, ఎంఈఓ అబ్దుల్ సత్తార్,డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, బ్రహ్మయ్య, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, సుబ్రహ్మణ్యం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలకు మార్కాపురంలో సర్వం సిద్ధం



**మార్కాపురం, జూన్ 19, ప్రభాతవార్త**
కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే మొహర్రం వేడుకలకు మార్కాపురం పట్టణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని వివిధ పీర్ల మాకాణాలలో పీర్లను కొలువుదీర్చి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ప్రసిద్ధి చెందిన గోర్లగడ్డ పీర్లచావిడిలో బాదుల్లా సాహెబ్, ఖాసీం సాహెబ్, బారా ఇమాం సాహెబ్, ఇమామ్ హస్సన్ సాహెబ్, ఇమామ్ హుస్సేన్ సాహెబ్ పీర్లు కొలువుదీరాయి. మొహర్రం సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి. జూన్ 22 (సోమవారం) మధ్యాహ్నం 2:00 గంటలకు, ఖాసీం సాహెబ్ పగలు ఉత్సవంజూన్ 25 (గురువారం) రాత్రి 2:00 గంటలకు - బాదుల్లా సాహెబ్ చిన్న షరిగెత్, జూన్ 26 (శుక్రవారం) రాత్రి 2:00 గంటలకు - పెద్ద షరిగెత్, జూన్ 27 (శనివారం) సాయంత్రం 5:00 గంటలకు - షహదత్ కార్యక్రమం జరుగునని నిర్వాహకులు తెలిపారు. మొహర్రం వేడుకలు శాంతియుతంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ముజావర్లు తెలిపారు. ఈ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సామరస్యాన్ని చాటాలని వారు కోరారు.

## దాతల తోడ్పాటు అభినందనీయం - ఎంఈఓ గుర్రం పెద్దిరాజు



**హనుమంతునిపాడు, జూన్ 19, ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ గుర్రం పెద్దిరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముప్పళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రాయళ్ళ సుబ్బారావు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ముఖ్య అతిధిగా విచ్చేసినటువంటి ఎంఈఓ గుర్రం పెద్దిరాజు చేతుల మీదుగా ప్రథమ బహుమతి రూ.5016, ద్వితీయ బహుమతిరూ.4016 నగదు బహుముతులు వారి తల్లిదండ్రులతో పాటు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా రాయళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి , పాఠశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాల ఉపాధ్యాయులకు, కన్న తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పోటీ తత్వంతో పాల్గొని ఉన్నత చదువులు చదవాలని విద్యార్థులను కోరారు. అలాగే ప్రతి ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తామని ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహకాలతో విద్యాభివృద్ధికి కృషిచేసిన రాయళ్ళ సుబ్బారావును విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ చెన్న కృష్ణయ్య, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పామూరు తహసీల్దార్ లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన బైరెడ్డి, దారపనేని



**పామూరు, జూన్ 19, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనాటి లక్ష్మీ నారాయణను కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు శుక్రవారం తహసీల్దార్ లక్ష్మీ నారాయణను పట్టు వస్త్రంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బైరెడ్డి, దారపనేని మాట్లాడుతూ బీఎల్ఓల ద్వారా నిర్వహిస్తున్న సర్ పక్రియను సజావుగా సాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, మండలంలో జీవనోపాధికై వలస వెళ్లిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారని ఎస్ఐఆర్ ద్వారా వలస ఓట్లపై సమగ్ర సమాచారం సేకరించాలని కోరారు. తూర్పుకోడిగుడ్లపాడు టీడీపీ సీనియర్ నాయకులు దారపనేని రాజేంద్రప్రసాద్, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, బూసి మౌలాలిరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఉన్నారు.

## మురళీ శ్రీనివాసరావు అకాల మరణం బాధాకరం

### - మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**పామూరు, జూన్ 19, ప్రభాతవార్త**
పామూరు మండలం బొట్ల గూడూరు గ్రామానికి చెందిన ఆవులూరి మురళీ శ్రీనివాస రావు అకాల మరణం బాధాకరమని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. శుక్రవారం మురళీ శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కదిరి బాబురావు ఆయన కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మురళీ శ్రీనివాసరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యంకల్పించాలని భగవంతుణ్ణి ప్రార్ధిస్తున్నట్లు తెలిపారు.

# సీఎం సభ ఏర్పాట్లపై ప్రత్యేక పరిశీలన

### - సభా ప్రాంగణంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు

### - ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, ఎస్పి హర్షవర్ధన్ రాజు





**గిద్దలూరు, జూన్ 19 ప్రభాతవార్త**
గిద్దలూరు మండలం కృష్ణంశెట్టి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవిని డిజిటల్ నర్వ్ సెంటర్‌నుఈ నెల చివరి వారంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం సిఎం సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి,జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలనిఅధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సభాప్రాగణంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని అక్కడ డిజిటల్ నర్వ్ సెంటర్‌లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీంచి తగు సూచనలు చేశారు.సంజీవిని పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, ఇతరఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగసముద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### - ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజాబాబు

### - హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**లింగసముద్రం, జూన్ 19, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో.. ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని, శుక్రవారం లింగసముద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. కలెక్టర్ పి.రాజాబాబు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించగా.. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పలువురు జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం నిర్వహించగా అనేక మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కలెక్టర్ ప్రతి అర్జీ వివరాలు తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.

**వారంలో అర్జీలకు పరిష్కారం : కలెక్టర్ రాజాబాబు**

అర్జీదారులు సమర్పించిన వివరాలను పరిశీలించిన తర్వాత, వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకపోతే, అందుకు సంబంధించిన కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తామన్నారు. అర్జీలలో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యల గురించి వచ్చాయని కలెక్టర్ వెల్లడించారు. లింగసముద్రం మండలంలో చుక్కల భూములు, ఆన్‌లైన్ సమస్యలు, అసైన్డ్ భూములు, విస్తీర్ణంలో తప్పులు గురించి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని, వారిలో సంతృప్తి స్థాయి పెంచేందుకు అన్ని శాఖల అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్లు రాజాబాబు వివరించారు.

## రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

### - ఎమ్మెల్యే నాగేశ్వరరావు



లింగసముద్రం మండలంలో ఏళ్ల తరబడి రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. రెండేళ్లుగా వీటిపై దృష్టి పెట్టి, ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఒకే చోటకు చేరడం వల్ల, సమస్య మూలాలను గుర్తించడం సులభం అవుతోందని, అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం కలిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను రాబోయే రోజుల్లో ఎక్కువగా నిర్వహిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని యర్రారెడ్డిపాలెం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న అర్జీదారులకు భోజన వసతి కల్పించారు. సబ్ కలెక్టర్ దామెర హిమశంశీ, డీఆర్వో మాధురి, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, పార్టీ నాయకులు అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్, ఇంకా పలువురు నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు పాల్గొనాలి

### - ప్రజాస్వామ్య పరిరక్షణకు ఖచ్చితమైన ఓటర్ల జాబితా అవసరం

### - డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం, జూన్ 19, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో సుమారు 4.16 కోట్ల మంది ఓటర్లు ఉన్న నేపథ్యంలో జూన్ 15 నుంచి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో ప్రజలంతా చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావడం ఎంత ముఖ్యమో, నకిలీ మరియు అనర్హ ఓట్ల తొలగింపు కూడా అంతే అవసరమని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓట్లు, ఇతర అనర్హ నమోదులను గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటర్ల జాబితా కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నందున ప్రజలు సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని సూచించారు. కొత్తగా ఓటరు హక్కు పొందిన యువత,మహిళలు తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైతే కొత్త నమోదు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు ఈ సందర్భంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని,పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

## అభివృద్ధి బాటలో దొరువు.. రోడ్లు, కుళాయిల పనుల తనిఖీ



**కనిగిరి, జూన్ 19, ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని దొరువు ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ కమీషనర్ పర్వతినేని శ్రీధర్‌తో కలిసి దొరువు ప్రాంతంలో జరుగుతున్న కుళాయిల ఏర్పాటు, రోడ్డు ఆధునీకరణ పనులను ఆయన ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులతో చర్చించి, నిర్ధేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరువతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని షేక్ ఫిరోజ్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించిన హౌసింగ్ డిఈ వెంకట సురేష్‌బాబు





**గిద్దలూరు జూన్ 19, ప్రభాతవార్త**
గిద్దలూరు మండలం పొదలకొండ పల్లి, గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ లేఔట్‌ల యందు నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను, కొమరోలు మండలం దద్దవాడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను మార్కాపురం డివిజన్ అధికారి శివపురం వెంకట సురేష్ బాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురోగతిలో ఉన్న గృహాలు, అసంపూర్తిగా ఉన్న గృహాలను తక్షణమే గృహ నిర్మాణాలు మొదలుపెట్టి పూర్తి చేసుకోవలసినదిగా లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని నిర్దేశిత గడువులోపు తమ గృహాలను పూర్తి చేసుకుని తమ సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఆకాంక్షి ంచారు. ఆయన వెంట గిద్దలూరు, కొమరోలు మండలాల సహాయక ఇంజినీర్లు యం మహేశ్వర రెడ్డి, జి కృష్ణారెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్లు మల్లా రెడ్డి, తిరుమలయ్య, రత్నాబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు కె రంజిత్ కుమార్, యం చిన్న వెంకటేశ్వర నాయక్, యస్ రాజ శేఖర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' సర్వేపై అత్యంత అప్రమత్తంగా ఉండాలి

### - దద్దాల నారాయణ యాదవ్




**కనిగిరి, జూన్ 19, ప్రభాతవార్త**
ఓటరు జాబితా సవరణ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్వేపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ బీఎల్ఏలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నకిలీ ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు పక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బీఎల్ఓలు సర్వే చేసే సమయంలో తప్పకుండా వారి వెంట ఉండాలన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫాం పూరించడంతో పాటు అందుకు సంబంధించిన పత్రాలు సంబంధిత అధికారులకు అందజేసే వరకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రత్యేక సవరణ పక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం, అనర్హులను చేర్చడం, మ్యాపింగ్ పక్రియలో అక్రమాలకు పాల్పడడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పక్రియను అడ్డం పెట్టుకుని అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఓటర్ల హక్కులను కాపాడటం బీఎల్ఏ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, ఎలాంటి అక్రమాలు జరిగినా వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి బూత్‌లో ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం అప్రమత్తంగా పని చేయాలని, ఒక్క అర్హత కలిగిన ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు.

## ఆవులూరి మురళీ మరణం బాధాకరం

### - ఎమ్మెల్యే ఉగ్ర



**పామూరు, జూన్ 19, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేసిన మురళీ మృతి తననెంతో బాధకలిగించిందని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంటరీ నియోజక వర్గ అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విచారం వ్యక్తం చేశారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామానికి చెందిన ఆవులూరి మురళీ శుక్రవారం నాడు ఆకస్మిక మృతిచెందారు.వివాదరహితుడైన మురళి మృతదేహాన్ని పార్టీలకు అతీతంగా పలువురు సందర్శించి నివాళులర్పించారు.ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బొట్ల గూడూరు గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి ఘనంగానివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ యార్డు చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు చౌదరి,రాష్ట్ర విభిన్నప్రతిభావంతుల కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, తదితరులు విచారం వ్యక్తం చేశారు.

## బాలికలకు విద్య, శక్తివంతమైన ఆయుధం: సిడిపిఓ సుధా

**బల్లికురవ, జూన్ 19, ప్రభాతవార్త**




బాలికలకు విద్య రక్షణ, కవచంలా పనిచేస్తుందని, తల్లిదండ్రులు బాలిక విద్యను ప్రత్యేకంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సిడిపిఓ సుధా అన్నారు. బాలికలకు విద్య ఒక శక్తివంతమైన ఆయుధంలా పనిచేస్తుందన్నారు. బాలిక విద్య ప్రాముఖ్యత, బాల్యవివాహాల జరిగే అనర్థాలను, ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నక్క బొక్కలపాడు అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకి అక్షరం నేర్పటం ద్వారా అటు కుటుంబానికి, ఇటు సమాజానికి ప్రగతి చేకూరుతుంద న్నారు. విద్యావంతులైన మహిళలు తన కుటుంబాన్ని ఆరోగ్యకరంగా ఉంచుతూ, పిల్లలకు మంచి పోషకాహారాన్ని అందజేస్తూ, ఆర్థిక స్వాతంత్రం సాధించగలుగుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం కింద అనేక కార్యక్రమాల రూపొందించారని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యని అందిస్తున్నారని, త్రాగునీరు, బాలికలకు ప్రత్యేకించి మరుగుదొడ్లు, పాఠశాలలోనే ఐరన్ టాబ్లెట్లు అందచేయడం, సానిటరీ నాపకిన్లు ఇవ్వడం లాంటివి బాలికల విద్యనే ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడు తుందని ఈ సందర్భంగా సుధా వివరించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదేశాల మేరకు ఆత్మహత్యల నివారణ కొరకు ప్రత్యేక డ్రైవ్ జూలై 17 వరకు నిర్వహి స్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. మహిళా హెల్ప్ లైన్ 181,లేదా పోలీస్ హెల్ప్ లైన్ 112 కి కాల్ చేయటము లాంటివి చేయాలని, ఆత్మహత్య కాదు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి అని తెలియజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.ప్రమీల, అంగన్వాడీ టీచర్లు సరస్వతి, సత్యవతి, అనంతలక్ష్మి, ఎం.వి ఫౌండేషన్ వాలంటీర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ సాయి గ్రానైట్లో ఘనంగా భద్రత వారోత్సవాలు

**బల్లికురవ, జూన్ 19, ప్రభాతవార్త**



స్థానిక కృష్ణ సాయి గ్రానైట్లో 23వ గనుల భద్రత వారోత్సవాలు శుక్రవారం ఘనంగా కొనసాగాయి. కార్మికులతో ప్రత్యేకమైన అనుబంధం ఇక్కడి యాజమాన్య ప్రతినిధులకు కొనసాగుతుంది. సంస్థ యాజమాన్యం ప్రతి ఏటా విజయదశమి పర్వదిన సందర్భంగా నూతన వస్త్రాలు బహూకరించి, వారితో తమకు ఉన్న అనుబంధాన్ని మరింతగా పెంచుకుంటుంది. గని ఏర్పాటు సమయం నుండి ఈ సాంప్రదాయం కొనసాగుతుంది. మిగిలిన వారికి భిన్నంగా గనిలోని కార్మికులు కూడా యాజమాన్యానికి విధేయులుగా మెలుగుతూ ఉంటారు . భద్రతా వారోత్సవాల సమయంలోను గనిలోని కార్మికులు తమ ప్రత్యేకతను చాటుకుంటారు. తమ సొంత కుటుంబంలోని విధిలాగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తుంటారు . ఈ సందర్భంగా బృందం కన్వీనర్ కేవీ సుబ్బయ్య మాట్లాడుతూ గనిలో పనిచేసే కార్మికుల భద్రతకు యాజమాన్యాలు ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు అన్నారు. ఈ సందర్భంగా గని పరిశీలించటంతో పాటు, మిషనరీ విభాగాలను, కార్మికుల వివరాలు సంబంధిత దస్త్రాలను , పవర్ పాయింట్ ను తనిఖీ బృత సభ్యులు పరిశీలించారు. కార్మికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యాజమాన్యం తమకు అందజేస్తున్న సౌకర్యాలను తనిఖీ బృంద సభ్యులకు వివరించారు. ఈ బృందంలో బాబా ఫక్రుద్దీన్ ,బ్రహ్మయ్య, బ్రహ్మారెడ్డి, ప్రశాంత్ ,స్థానిక గణి కార్మికులు పాల్గొన్నారు .

## దేవాలయ శంకుస్థాపన మహోత్సవము

**వేటపాలెం, జూన్ 19, ప్రభాతవార్త**



దేశాయిపేట గ్రామం రామానగర్ లోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన శంకుస్థాపన మహోత్సవము శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య ఆధ్వర్యంలో పసుమర్తి మల్లికార్జున రావు బాల వెంకట పద్మ కుమారి దంపతుల చేతుల మీదుగా ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1 5 కోట్ల రూపాయల అంచనాతో దేవాలయ నిర్మాణం చేపడుతున్నామని ఎవరైనా విరాళములు ఇచ్చే దాతలు ఉంటే దేవస్థాన కమిటీ వారిని సంప్రదించవలసినదిగా కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటుగా స్థానిక ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల మెరుపు దాడి

**- 14 మంది అరెస్ట్, రూ.1.82 లక్షల నగదు స్వాధీనం**

**వేటపాలెం, జూన్ 19, ప్రభాతవార్త**




చీరాల రూరల్ సిఐ సుధాకర్ పర్యవేక్షణలో వేటపాలెం పోలీసులు జూదరుల ఆట కట్టించారు. వేటపాలెం మండలం చెల్లారెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని కటారివారిపాలెం గ్రామంలో గురువారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 14 మందిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుండి రూ.1,82,560/ నగదును స్వాధీనం చేసుకున్నారు. కటారివారిపాలెం గ్రామంలోని ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు చేరి పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారు అనే పక్కా సమాచారం తో చీరాల రూరల్ సిఐ పర్యవేక్షణలో, వేటపాలెం ఎస్సై జనార్ధన్ తన సిబ్బందితో కలిసి సదరు ఇంటిపై ఆకస్మిక దాడి చేసి పేకాటరాయుళ్లను వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై కేసులు నమోదు చేశారు. మెరుపు దాడితో పేకాటరాయుళ్లను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ వేటపాలెం పోలీసులకు అభినందనలు తెలియజేశారు.

## వి.వి.పాలెం నూతన తాసిల్దారుగా ఎల్.లావణ్య

**వలేటివారిపాలెం, జూన్ 19, ప్రభాతవార్త**



వలేటివారిపాలెం మండలం తాసిల్దారుగా ఎల్. లావణ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరు కలెక్టర్ ఆఫీస్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్.ఐ వీఆర్వోలు సింహాద్రి,మస్తాను నారాయణ, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## నూకవరంలో సర్ సర్వే ప్రారంభం

**వలేటివారిపాలెం, జూన్ 19, ప్రభాతవార్త**



మండలపరిధిలోని నూకవరం గ్రామంలో శుక్రవారం సర్ సర్వేకార్యక్రమం ప్రారంభమైంది. బిఎల్ఓ రజిని సర్వే చేశారు. సర్వేఫారాలను ప్రజలకు అందజేశారు. వారు వెంట తగరం సుధాకర్, జగన్, ఆనంద్, రాజేష్, ఆనందరావు, నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు కార్యాలయంలో మహిళలకు శిక్షణ

**బల్లికురవ, జూన్ 19, ప్రభాతవార్త**

స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలో ఉన్న గ్రామ సంఘం అధ్యక్షులకు ఏడాది వార్షిక ప్రణాళిక 2 మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామ సంఘాల పరిధిలో, తాము చేపట్టబోయే ఆర్థిక సంబంధిత విషయాలు ఎలా చేయాలో, దానికి సంబంధించి విధివిధానాలు మహిళలకు వివరించారు. గ్రామ సంఘాలకి కావలసిన ఆదాయ వనరులు, ప్రస్తుతం ఉన్నవి, అవసరమైనవి, వాటిని ఎలా ఉపయోగించాలి అనే విషయాలు, ప్రముఖంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి ,ఏపిఎం రాజారావు, పేరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

**బల్లికురవ, జూన్ 19, ప్రభాతవార్త**

అన్నదాతలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రవేశపెట్టిన ప్రయోజనకర పథకం అన్నదాత సుఖీభవ. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం శనివారం నిధులు విడుదల చేయనున్నట్లు వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. రైతుల వ్యవసాయ పెట్టుబడి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సహాయం అందించేందుకు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం, అన్నదాతలకు పెట్టుబడి సహాయాన్ని అందజేస్తుందన్నారు. అర్హత కలిగిన రైతులు ఖాతాలో ఈ నిధులు జమ కానున్నాయన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి

**దర్శి, జూన్ 19, ప్రభాతవార్త**



అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని ఎలిమెంటరీ స్కూల్ కు ప్రమోట్ అవుతున్న పిల్ల లకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో ఆర్.పరిమళ ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ పిల్లలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో వారు మంచి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని దానికి అంగన్‌శాడీలో పూర్వ ప్రాథమిక విద్య తొలిమెట్టుగా ఉంటుందని తెలియజేశారు. అలాగే గ్రామంలోని మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరిని ప్రభుత్వ అంగన్‌వాడీలో మాత్రమే నమోదు చేయాలని ప్రైవేటు బడులలో చేర్పించడం వల్ల జరిగే అనర్థాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 20 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి వారికి సర్టిఫికేట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి ఐసీడీఎస్ సీడీపీవో ఆర్.పరిమళ, కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బట్టు రామారావు, ఐటీసీ ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సోమా వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.అనురాధ, స్కూల్ హెచ్ఎంబీ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.పద్మ, జ్యోతి, ప్రమీల సమీపంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## జోన్ కాలువ అభివృద్ధి పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

**దర్శి, జూన్ 19, ప్రభాతవార్త**



దర్శి మున్సిపల్ పరిధిలోని కురిచేడు రోడ్డులో గల అన్న క్యాంటీన్ వెనుక బజార్‌లో గల జోన్ కాలువలో జరుగుతున్న పూడిక తీత కార్యక్రమంను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అభివృద్ధి పను లలో నాణ్యత ప్రమాణాలు ముఖ్యమ న్నారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్ర మాలకు ఎస్టిమేషన్‌లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శ్రీనివాసరావు, దినకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుభాని పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా సానికొమ్ము తిరుపతిరెడ్డి

**దర్శి, జూన్ 19, ప్రభాతవార్త**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మల సహకారంతో వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గా దర్శికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ రాష్ట్ర డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇంతటి పదవి రావడానికి అవ కాశం కల్పించిన దర్శి ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలకి రుణపడి ఉంటానని రాష్ట్రంలో వాణిజ్య విభాగంలో సమస్యలపై పోరాడుతానని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఇంతటి అవకాశం నాకు ఇచ్చిన బూచేపల్లి కుటుంబానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## నేడు శంకరాపురంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం సభ

**ముండ్లమూరు, జూన్ 19, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలం లో అన్నదాత సుఖీభవలో భాగంగా రెండవ సంవత్స రం మొదట విడత కింద 11010 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మొత్తం ఐదు కోట్ల 51 లక్షల రూపాయలు, పీఎంకిసాన్ 23వ విడత కింద రూ.2000 లు చొప్పున 8890 మంది రైతులకు గాను మొత్తం ఒక కోటి 78 లక్షల రపాయలు డైరెక్ట్‌గా రైతు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ ఫోగ్రాం (లైవ్ టెలికాస్ట్) శనివారం మధ్యాహ్నం 3.45 నిమిషాల నుండి ప్రతి రైతు సేవ కేంద్రంలో రైతులకు లైవ్ ఫోగ్రామ్ చూపించడం జరుగుతుంది. నేడు శంకరాపురంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొంటారని, శుక్రవారం సభ స్థలాన్ని పరిశీలించిన వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ రాధా, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం

**దర్శి, జూన్ 19, ప్రభాతవార్త**



జన విజ్ఞాన వేదిక సభ్యత్వ పోస్టర్‌ను శ్రీ ప్రశాంత హైస్కూల్ నందు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జేవీవీ జిల్లా కార్యదర్శి బి.దేవప్రసాద్, దర్శి మండల అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, యలమందరెడ్డి, ఎస్.తిరుపతిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు హాజరై సభ్యత్వ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, దేశ స్వలంబన కోసం సైన్స్ అనే నినాదంతో జనవిజ్ఞాన వేదిక విద్య, ఆరోగ్యం, పర్యావరణం, సేవా దృక్పథం మూఢనమ్మకాలు మీద ఎన్నో కార్యక్రమాలు చేసింది అని జిల్లా కార్యదర్శి కొనియాడారు.

## కారుమూరి అరెస్టు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు

**ఒంగోలు, ప్రభాతవార్త**




కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ అరెస్టు పూర్తిగా రాజకీయకక్ష సాధింపు చర్య అని జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఒంగోలులోని వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేని మద్యం కేసు సృష్టించి వైసీపీ నాయకులను వేధిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుటుంబాన్ని ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విక్రయాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో పారదర్శకంగా జరిగాయన్నారు. బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లను రద్దు చేసి అక్రమ మద్యం నియంత్రించారన్నారు. 2014-19 మద్యం అక్రమాలపై దృష్టి మళ్లించేందుకే ప్రస్తుత కేసులు పెడుతున్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అన్నారు. అక్రమ అరెస్టులు, కేసులతో వైఎస్సార్‌సీపీని భయపెట్టలేరన్నారు. బీసీ యువ నాయకుడు సునీల్ యాదవ్‌ను రాజకీయంగా ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డీఎస్సీ-2025 సాయి కృష్ణ లాకప్ డెత్ క్రాంతి కుమార్ ఘటనల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ అరెస్టు అన్నారు. సాయికృష్ణ కేసులో ప్రభుత్వం స్పందించడానికి వైస్ జగన్ జోక్యమే కారణం అన్నారు. రాష్ట్రంలో అన్యాయాలను వెలుగులోకి తెచ్చేది వైఎస్ జగన్ నాయకత్వమే అన్నారు. ఆక్వా రైతుల సమస్యలపై జగన్ పోరాటం తర్వాతే ప్రభుత్వం స్పందించిందన్నారు. అమరావతి పేరుతో దోపిడి, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష నాయకులపై వరుస కేసులు పెడుతున్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. అక్రమ అరెస్టులు ఆపకపోతే ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## ముమ్మరంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం

**అద్దంకి, జూన్ 19, ప్రభాతవార్త**





ఓటర్ల జాబితా సవరణ జాబితా ముమ్మరంగా సాగుతుంది. సర్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించి బిఎల్‌ఓలు వారికి కేటాయించిన పరిధిలో ఇంటింట తిరిగి ఓటర్లకు సంబంధించిన పూర్తివివరాలను సేకరించి, తగిన గుర్తింపు కార్డులను పరిశీలించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్లకు సంబంధిత డాక్యూమెంట్లను అందజేస్తున్నారు. వీరి వెంట ఆయా వార్డులు, గ్రామాలలో వివిధ పార్టీలనుండి బిఎల్ఏలు కూడ పాల్గొంటున్నారు. ఎన్‌టిఆర్ నగర్‌లో కమీషనర్ రవీంద్ర ఈ కార్యక్రమాన్ని పరిశీలించగా ఆయన వెంట మాజీ కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు వున్నారు. అదే విధంగా మాజీ కౌన్సిలర్ జబ్బార్ తన వార్డులోను ఈ కార్యక్రమంలో





పాల్గొన్నారు. 7వ వార్డులో కమీషనర్ పి.రవీంద్ర ఈ కార్యక్రమాన్ని పరిశీలించగా బిఎల్ఏ జడా విజయ్ పాల్గొన్నారు. కలవకూరు గ్రామంలో సర్ కార్యక్రమం జరుగుతుండగా బిఎల్ఏ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు రైతులకు అన్నదాద సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు జమ

**అద్దంకి, జూన్ 19, ప్రభాతవార్త :**

రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభ నేపద్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుండి పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఈ సంవత్సరం మొదటి విడత నిధులు శనివారం విడుదల కానున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈనిధులను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, అద్దంకి నియోజకవర్గంలో జె పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నిధులు విడుదల చేయనున్నారు. అద్దంకి నియోజక వర్గంలో మొత్తం 40,288 మంది రైతు కుటుంబాలకు 27.162 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేస్తారని అద్దంకి ఎఒ వెంకట కృష్ణ తెలిపారు.

## 8 గ్రామ సచివాలయాలకు యుపీఎస్ బ్యాటరీలు సరఫరా

**సంతనూతలపాడు, జూన్ 19, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలంలోని ఎనిమిది గ్రామ సచివాలయాలకు శుక్రవారం నాడు యుపీఎస్ బ్యాటరీలను ఆయా సచివాలయాలలో ఎంపీడీవో డి.సురేష్ అందించారు. మండలం లోని బొడ్డువారిపాలెం, చిలకపాడు, ఎనికపాడు, వేములపాడు, గుడిపాడు, మైనంపాడు, ఎం డ్లూరు తదితర సచివాలయాలకు వీటిని సరఫరా చేశారు. గతంలో కొన్ని సచివాలయాలకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.రవికుమార్, మండల స్వర్ణ గ్రామ ప్రతినిధి దినకర్, పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భగవాన్ శ్రీ వెంకయ్య, శ్రీబైనబోయిన స్వామివార్ల ఆరాధన మహోత్సవ వేడుకలు

**సంతనూతలపాడు, జూన్ 19, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన సంతనూతలపాడులో ఈనెల 19న శుక్రవారం నాడు భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్య స్వామి 18వ, శ్రీ బైనబోయిన స్వామి వారి 15వ ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంతనూతలపాడులోని శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి సేవా కేంద్రం శిష్య బృందం ఆధ్వర్యంలో ఈనెల 18,19వ తేదీల్లో గల రెండు రోజులు పాటు ఈ ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ నెల 18న గురువారం రాత్రి సంతనూతలపాడు కేంద్రంలో భగవాన్ వెంకయ్య స్వామి, బైనబోయిన స్వామి వాళ్లకు భారీ విద్యుత్ అలంకరణల మధ్య



భజనలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈనెల 19న శుక్రవారం నాడు భగవాన్ వెంకయ్య స్వామి వారి పంచలోహ మూర్తికి, పూజ్య గురువులు శ్రీ బైనబోయిన స్వామి వారి మహా సమాధి వద్ద అభిషేకాలు నిర్వహించారు. ముత్యాల పందిరిలో స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. బైనబోయిన స్వామివారి శిష్యురాలు మాతృ శ్రీ దుర్గమ్మ చే అగ్నిగుండం ప్రజ్వలన వేడుకలు జరిగాయి. పిఠాపురం దత్త పీఠం శ్రీశ్రీశ్రీ విశ్వానంద భారతి స్వామి వారిచే కట్టయోగి, హిమాలయ యోగి తదితర పూజా వేడుకలు జరిగాయి. స్వామి వాళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మందికి అన్నదాన వేడుకలు నిర్వహించారు. శ్రీ బైనబోయిన స్వామి వారి సతీమణి విజయలక్ష్మి తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. రెండు రోజులు పాటు జరిగిన ఈ ఆరాధన మహోత్సవ వేడుకలు సంతనూతలపాడులో ఒక పండుగ వాతావరణంలో జరిగింది. రాజమండ్రి, జంగారెడ్డిగూడెం, చుండూరు, ములగలపల్లి, విజయవాడ, చెన్నై, తిరుపతి, గుంటూరు తదితర కేంద్రాల నుండి భక్తులు ఈ వేడుకలకు విశేషంగా హాజరయ్యారు. ప్రతి ఏడాది ఈ రాధన మహోత్సవ వేడుకలను భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి సేవా కేంద్రం శిష్య బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.



## నేడు రైతులు ఖాతాలలో 7000 రూపాయలు నగదు జమ

**- అద్దంకి వ్యవసాయ సంచాలకులు బి.ఎఫ్రాయఎమ్**

**జె.పంగులూరు, జూన్ 19, ప్రభాతవార్త**



మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.స్వరూప రాణి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి శుక్రవారం జరిగిన సమావేశంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ యోజన పథకం ప్రోగ్రాం అన్నదాత సుఖీభవ 2026-27 సంవత్సరానికి మొదటి విడత 5000/ రూపాయలు, పీఎం కిసాన్ యోజన పథకము కింద 23 మూడవ విడత నగదు రైతులు ఖాతాలలో తేదిన శనివారంన జమ చేయడం జరుగుతుందని అద్దంకి వ్యవసాయ సంచాలకులు బి.ఎఫ్రాయఎమ్ తెలియజేశారు. సందర్భంగా అద్దంకి వ్యవసాయ సంచాలకులు బి.ఎఫ్రాయఎమ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులకు ఖాతాకు అన్నదాత సుఖీభవ మొదటి విడత 5000 వేల రూపాయలు, పిఎం కిసాన్ యోజన పథకం కింద 23 మూడవ విడత 2000 వేలు మొత్తం 7000 వేల రూపాయలు రైతుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు,అన్ని గ్రామాల రైతులందరూ పాల్గొని ఈసభను జయప్రదం చేయాలన్నారు.

## నేడు కరెంటు అంతరాయం

**కొత్తపట్నం, జూన్ 19, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం లోని 132 కెవి టంగుటూరు నుండి వచ్చే కొత్త లైన్లో స్తంభాలు మరియు విద్యుత్తు మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొత్తపట్నం ఏఈ,ప్రసాద్ తెలియజేశారు. శనివారం ఉదయం 7 గం నుండి మధ్యాహ్నం 1.00 గం వరకు కొత్తపట్నం, వజ్జిరెడ్డిపాళెం, గమళ్లపాలెం, రంగయపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు మరియు సంకువాణిగుంట గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అగ్రికల్చర్ మరియు ఆక్వాకు అంతరాయం కలుగుతుంది, కావున ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు అగ్రికల్చర్ ఇచ్చి, తరువాత మధ్యాహ్నం 1 గంట నుండి కంటిన్యూ గా విద్యుత్ సరఫరా ఇస్తామనీ తెలియజేయటం జరిగింది. కావున విద్యుత్ వినియోగ దారులందరూ గమనించి విద విద్యుత్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

